కేటీఆర్‌కు ఐఐటీ మద్రాస్ ఆహ్వానం

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అత్యుత్తమ ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో ఒకటైన ఐఐటీ మద్రాస్‌లో జరుగనున్న ఈ-సమ్మిట్‌లో ప్రసంగించాల్సిందిగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావుకు ఆహ్వానం అందింది. ప్రతి ఏటా నిర్వహించే ఆంత్రప్రెన్యూరల్ ఫెస్టివల్ (ఈ-సమ్మిట్)లో కీలకోపన్యాసం చేయాలని ఐఐటి మద్రాస్ కేటీఆర్‌ను కోరింది ఈ- సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి పారిశ్రామిక రంగంలో కీలకమైన వ్యక్తులను, సంస్థల అధిపతులను, విధాన నిర్ణేతలను ఐఐటీ మద్రాస్ ఆహ్వానిస్తుంది. కేటీఆర్‌కు ఉన్న అపారమైన అనుభవం నేపథ్యంలో భవిష్యత్తు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు దిశానిర్దేశం చేయాల్సిందిగా కేటీఆర్‌కు పంపిన ఆహ్వానంలో ఐఐటీ మద్రాస్ కోరింది. శనివారం నుంచి రెండు రోజులపాటు ఈ సదస్సు జరుగనున్నది.

పార్టీ మారను.. బీఆర్‌ఎస్‌లోనే ఉంటా

- మాజీ మంత్రి మల్లారెడ్డి.. కేటీఆర్‌తో భేటీ

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): తాను పార్టీ మారడం లేదని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పార్టీ మారుతున్నారనే ప్రచారంపై వారు కేటీఆర్‌కు వివరణ ఇచ్చినట్టుగా తెలిసింది. కొందరు కావాలనే తమపై తప్పుడు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని, తమ విద్యాసంస్థల ప్రతిష్ఠ దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. తమ వద్ద అన్ని పత్రాలు ఉన్నా పాలకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. తన కుమారుడు భద్రారెడ్డి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తిగా లేడని కేటీఆర్‌కు మల్లారెడ్డి తెలిపారు. తన అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థల పైనా ప్రభుత్వం కక్ష సాధింపునకు పాల్పడుతున్నదని చెప్పారు. పార్టీ నిలబెట్టిన అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామని చెప్పినట్టు తెలిసింది.

ఆడబిడ్డల హక్కులు హరిస్తే ఊరుకోం

జీవో 3ను వెనక్కి తీసుకొనేవరకు పోరాడుతాం

- ఉద్యోగాల్లో 33% మహిళలకివ్వాలి
- మహిళా వ్యతిరేకి కాంగ్రెస్
- సోనియా, ప్రియాంక ఇద్దరూ పార్లమెంట్‌కు వెళ్లాలి కానీ, తెలంగాణ ఆడబిడ్డలు ఇండ్లలో వంట చేసుకోవాల్నా?
- ఇందిరాపార్కు మహాధర్నాలో ఎమ్మెల్సీ కవిత ఫైర్

హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద మహాధర్నాలో నినదిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ): ఉద్యోగావకాశాల్లో మహిళలకు కేసీఆర్ ప్రభుత్వం కల్పించిన 33% వాటాను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసి ఆడబిడ్డలకు అన్యాయం చేసిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ ఆడబిడ్డలకు నష్టం చేకూర్చే జీవో 3ని రద్దు చేయకపోతే ఎంతవరకైనా పోరాటం కొనసాగిస్తామని, ఆడబిడ్డల హక్కులు హరిస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. జీవో 3ని రద్దు చేసి ఉద్యోగావకాశాల్లో మహిళలకు 33% వాటా కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భారత జాగృతి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవో 3 కారణంగా ఇటీవల చేపట్టిన గురుకుల నియామకాల్లో ఆడబిడ్డలకు 12% వాటా కూడా దక్కలేదని ఆవేదన వ్యక్తంచేశారు. జీవో 3ని వెనక్కి తీసుకునే వరకు స్ట్రీట్‌ఫైట్, లీగల్‌ఫైట్ చేస్తామని హెచ్చరించారు. త్వరలో గవర్నర్‌ను కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు.జీవో 41ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. నియామకాల్లో హారిజంటల్ రిజర్వేషన్లు అమలుచేయాలని 2022లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేయాలని తెలంగాణ హైకోర్టు కూడా ఆదేశించిన నేపథ్యంలో దానిని కేసీఆర్ ప్రభుత్వం అప్పీల్‌చేసిందని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం వేసిన కేసును రేవంత్ సర్కార్ ఫిబ్రవరి 6న ఉపసంహరించుకుని ఆడబిడ్డలకు ఉద్యోగాలు రాకుండా అడ్డుకున్నదని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ఓటుకు నోటు కేసుపై ఉన్న శ్రద్ధ ఆడపిల్లల ఉద్యోగాల మీద ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రజావాణిని పట్టించుకోని రేవంత్‌రెడ్డికి ఢిల్లీ వాణి మాత్రమే వినిపిస్తుందని ఎద్దేవా చేశారు.

ఆడబిడ్డలకు అపాయింట్‌మెంట్ ఇవ్వని సీఎం

'మీ సోనియా, ప్రియాంక పార్లమెంట్‌కు వెళ్లాలి. కానీ, తెలంగాణ ఆడబిడ్డలు ఉద్యోగాలకు దూరమై ఇంట్లో వంట చేసుకోవాలా? ఇదేం న్యాయం?' అని కవిత ధ్వజమెత్తారు. ఉద్యోగాల్లో అన్యాయం జరిగిందని ఆడబిడ్డలు సీఎంను కలుద్దామని పోతే అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. 'మేం చాకలి ఐలమ్మ, రాణీరుద్రమ, ప్రొఫెసర్ జయశంకర్ సార్ వారసులం. నీతికి, న్యాయానికి కట్టుబడి మాట్లాడేటోళ్లం. అబద్ధాలు చెప్పి ఉద్యమాలు చేయలేదు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి రాలేదు. నిజం చెప్పి ముందుకుపోతాం' అని స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీ ఆనాడు నిరుద్యోగులను ప్రచారానికి వాడుకుని ఈనాడు వారికి అన్యాయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. మహిళా వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ అవలంబిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు జరిపిన నియామకాల్లో ఎంత మంది మహిళలకు ఉద్యోగాలు లభించాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాధారణంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవంనాడు మహిళలు ఉత్సవాలు చేసుకుంటారని కానీ, తెలంగాణలో ధర్నా చేయాల్సిన పరిస్థితి ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. గురుకులాల నియామకాల్లో దివ్యాంగులకు 4% రిజర్వేషన్లు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. 108 ఉద్యోగులు, ఆశా వర్కర్ల, అంగన్‌వాడీలకు జీతాలు రావడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపినాథ్, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, దేవీప్రసాద్, రాజీవ్ సాగర్, గజ్జల నగేశ్, గెల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్

నేతన్న పొట్టగొడితే సహించం

- 14లోపు బతుకమ్మ చీరల ఆర్డర్లు, బకాయిలు చెల్లించాలి
- లేదంటే 15న సిరిసిల్లలో నేతన్నలతో మహాధర్నా
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ హెచ్చరిక

రాజన్న సిరిసిల్ల, మార్చి 8 (నమస్తే తెలంగాణ)/సిరిసిల్ల టౌన్: 'నేతన్న పొట్టగొడితే ఊరుకునేది లేదు. బతుకమ్మ చీరల ఆర్డర్లు, పెండింగ్‌లో ఉన్న బకాయిలు ఈ నెల 14లోపు చెల్లించాలి. లేదంటే 15న సిరిసిల్లలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వేలాది మంది నేతన్నలతో కలిసి మహాధర్నా నిర్వహిస్తాం' బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత సిరిసిల్ల పవర్‌లూం కార్మికులకు బతుకు దెరువు కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్‌తో పాటు రాజీవ్ విద్యామిషన్ ద్వారా స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లు ఇచ్చిందన్నారు. కానీ కాంగ్రెస్ సర్కారు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకుండా నేతన్నల పొట్టగొడుతున్నదని మండిపడ్డారు. గతంలో తయారు చేసిన బతుకమ్మ చీరలు, రాజీవ్‌విద్యామిషన్ వస్త్రాల తయారీకి సంబంధించి రూ.200 కోట్లు ఇంకా విడుదల చేయకపోవడంతో యజమానులు, ఆసాములు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. 'కత్తెర పెడతాం.. పేగులు మెడలో వేసుకుంటాం' అని సీఎం స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి మాట్లాడటం పద్ధతి కాదని హితవు పలికారు. నేతన్నల విషయంలో వెంటనే నిర్ణయం తీసుకోవాలని, లేదంటే 15న చేపట్టే ధర్నాలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు వేలాది మంది నేతన్నలు పాల్గొంటారని తెలిపారు. రేవంత్‌రెడ్డిది కార్మిక వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. తెచ్చిన అప్పులు కట్టలేక ప్రభుత్వం పైసలివ్వక పోవడం వల్ల సాంచాలు బంద్‌పెట్టారని తెలిపారు. నాడు ఎంపీగా ఉన్న కేసీఆర్ జోలె పట్టి చందాలు పోగు చేసి రూ.50 లక్షలు పద్మశాలీ ట్రస్టుకు అందించారని గుర్తుచేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నేత కార్మికులకు రూ.3,400 కోట్ల ఆర్డర్లు ఇచ్చినట్టు చెప్పారు.

రేవంత్‌రెడ్డిది ఓట్ల రాజకీయం

- హడావుడిగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శంకుస్థాపన
- శ్రమ కేటీఆర్‌ది.. ప్రచారం రేవంత్‌ది
- డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించాలి
- బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్

హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న క్రిశాంక్

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే సీఎం రేవంత్‌రెడ్డి హడావుడిగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత మన్నె క్రిశాంక్ విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల రాజకీయంతోనే ఎన్నికల కోడ్ రాకముందే పనులను ప్రారంభించారని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో భూముల కోసం గతంలో మంత్రిగా కేటీఆర్ విశేషంగా కృషి చేశారని కానీ, నేడు వాటి పనులను హడావుడిగా ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం తాను చేయని పనిని చేసినట్టుగా ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ను అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు బీజేపీ బీ టీంగా ఆరోపించారని, ఇప్పుడేమో కేంద్రంతో ఆ పార్టీ ఘర్షణ పూరిత వైఖరిని అవలంబించిందని అంటున్నారని, ఆ రెండిట్లో ఏది కరెక్టో రేవంత్‌రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. కారిడార్ల వెంట మెట్రో వే నిర్మించకుంటే భవిష్యత్తులో మళ్లీ ఇబ్బందులు వస్తాయని హెచ్చరించారు. రక్షణ శాఖకు భూములు, ప్రత్యామ్నాయాలు చూపడానికి ప్రత్యేక కంటోన్మెంట్ బోర్డు సమావేశాన్ని గతంలో ఏర్పాటు చేశారని, ఈ సమావేశానికి ఆనాటి ఎంపీగా రేవంత్‌రెడ్డి హాజరుకానే లేదని తెలిపారు. మల్కాజ్‌గిరి, కంటోన్మెంట్ ప్రజలను మోసగించడానికే శంకుస్థాపన కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టారని విమర్శించారు. రక్షణ శాఖకు రూ.750 కోట్లు ఇవ్వాలని, ప్రత్యామ్నాయ భూములను బదలాయించాలని రక్షణ శాఖ ఇచ్చిన ఆదేశాల్లో ఉన్నదని, ఆయా విషయాలపై రేవంత్‌రెడ్డికి కనీస అవగాహన కూడా లేదని చెప్పారు.

ఆలిండియా ఓబీసీ పాదయాత్ర బృందానికి ఘన సన్మానం

హైదరాబాద్, మార్చి8 (నమస్తే తెలంగాణ): జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీల వాటా సాధనకు ఆలిండియా ఓబీసీ బృందం చేపట్టిన మహాపాదయాత్రకు ఘన స్వాగతం లభించింది. మహబూబ్‌నగర్ జిల్లా మిర్‌గోన్‌పల్లి నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర శుక్రవారం హైదరాబాద్ చేరింది. గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు చేరిన ఓబీసీ బృందం నేతలకు వివిధ ప్రజాసంఘాల నాయకులు స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. పాదయాత్ర బృందంలో ఓబీసీ జేఏసీ నేతలు = నరేందర్, బత్తుల సిద్దేశ్వర్లు, మేకపోతుల నరేందర్‌గౌడ్, బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణయ్య తదితరులున్నారు.

పేదలకు ఎమ్మెల్యే సంజయ్ కంటి ఆపరేషన్లు

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గొప్ప మనసు చాటుకున్నారు. జిల్లా కేంద్రంలోని పావని కంటి దవాఖాన, రోటరీ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గ, పరిసర ప్రాంతాలకు చెందిన నిరుపేదలు 15 మందికి శుక్రవారం ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశారు. మందులు, కండ్ల అద్దాలు పంపిణీ చేశారు. - జగిత్యాల

నిమ్స్ దవాఖానలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదరనర్సింహా

వైద్యసేవల్లో రాష్ట్రానికి ప్రపంచస్థాయి గుర్తింపు

వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి రాజనర్సింహా

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 8 (నమస్తే తెలంగాణ): వైద్యసేవల్లో రాష్ట్రానికి ప్రపంచస్థాయి గుర్తింపును తెచ్చేందుకు ఇక్కడి వైద్యులు నిరంతరం కృషి చేస్తున్నారని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కొనియాడారు. రాష్ట్రంలోని ఉస్మానియా, గాంధీ, కాకతీయ, నిమ్స్ దవాఖానల వైద్యులు ఆ మేరకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నిమ్స్ దవాఖానలో రూ.12 కోట్లతో నిర్మించిన డీఎస్‌ఏ ల్యాబ్, రూ.5 కోట్లతో నిర్మించిన సీపీఆర్ అడ్వాన్స్‌డ్ హై-ఫైడ్లిటీ టెక్ ఎనేబుల్డ్ క్రిటికల్ కేర్ సిమ్యులేషన్ స్కిల్ లాబ్‌లను శుక్రవారం ఆ శాఖ కార్యదర్శి క్రిస్టినా, జెన్నిఫర్ లార్సన్-యూఎస్ కౌన్సిల్ జనరల్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిమ్స్ దవాఖానకు బ్రాండ్ ఇమేజ్ ఉన్నదని, దానిని కొనసాగేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే 20 ఏండ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్య, వైద్య రంగాలు మరింత అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్యాచరణను రూపొందిస్తున్నట్టు తెలిపారు. అంతకు ముందు మంత్రి నిమ్స్ దవాఖానలోని అన్ని ప్రధాన విభాగాల్లో మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం నిమ్స్‌లో 39 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 300 మంది స్టాఫ్‌నర్సులకు నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, సూపరింటెండెంట్ సత్యనారాయణ, కార్డియాలజీ విభాగాధిపతి సాయిసతీశ్, కార్డియోవ్యాస్కులర్ నిపుణులు అమరేశ్, పల్మనాలజీ నిపుణులు పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడే రాజకీయం

మొదటిపేజీ తరువాయి...

బాధ్యత తమపై ఉన్నదని చెప్పారు. శుక్రవారం ఫలక్‌నుమాలో మెట్రో రెండో దశలో ఎంజీబీఎస్-ఫలక్‌నుమా మార్గం నిర్మాణ పనులకు ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. 'ఎన్నికల సమయంలోనే ఎంఐఎంతో వైరం. ఆ తర్వాత అభివృద్ధి గురించి పరస్పరం కలిసి చర్చించుకుంటూ ముందుకు వెళ్లాలన్న ఆలోచనతో మా ప్రభుత్వం ఉన్నది. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంఐఎం ప్రజాప్రతినిధులతో కలిసి హైదరాబాద్‌ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్తాం. అందులో భాగంగానే ఎంఐఎం ప్రజాప్రతినిధిని లండన్‌లోని థేమ్స్ నదీ తీరం అభివృద్ధిని స్వయంగా పరిశీలించేందుకు తీసుకెళ్లాం' అని వివరించారు. మూసీ నదిని 55 కిలోమీటర్ల మేర అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పాతబస్తీకి రావాల్సిన మెట్రో ఆలస్యమైందని, అందుకే 5.5 కిలోమీటర్ల మెట్రోమార్గంలో పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేస్తున్నామని వివరించారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్ మీదుగా ఒవైసీ దవాఖాన, చాంద్రాయణ గుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, పీ7 రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రోమార్గాన్ని నిర్మించాలని నిర్ణయించామని వెల్లడించారు. మరిన్ని మార్గాల్లో మెట్రో నిర్మాణానికి డీపీఆర్‌లను రూపొందిస్తున్నామని తెలిపారు. చాంద్రాయణగుట్టలో అతి పెద్ద మెట్రో జంక్షన్ నిర్మాణం జరుగుతుందని అన్నారు.

చంచల్‌గూడ జైలు స్థానంలో విద్యాసంస్థ

అసదుద్దీన్ ఒవైసీ సూచన మేరకు చంచల్‌గూడ జైలును తరలించి, ఆ స్థానంలో పేద, మధ్య తరగతి ప్రజల పిల్లలకు అవసరమైన విద్యాసంస్థలను ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తామని రేవంత్ తెలిపారు. ఉస్మానియా దవాఖానను సైతం అత్యాధునికంగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మీరాలం చెరువుపై ఒక బ్రిడ్జిని నిర్మించాలని కోరారని, దానికి రూ.360 కోట్లు కేటాయిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రతి వీధి అభివృద్ధి జరగాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం ఉన్నదని, అందుకే పురపాలకశాఖను తన వద్దే పెట్టుకొని నిరంతరం పర్యవేక్షిస్తుంటానని పేర్కొన్నారు.

సోదరుడికి సీఎం పరామర్శ

కొండాపూర్: అనారోగ్యంతో హైటెక్‌సిటీలోని మెడికవర్ దవాఖానలో చికిత్స పొందుతున్న తన సోదరుడు తిరుపతిరెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న సీఎం.. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా మెడికవర్ దవాఖానకు వెళ్లి సోదరుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తిరుపతిరెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, త్వరలోనే కోలుకుని ఇంటికి చేరుకుంటారని వైద్యులు తెలిపారు.

అభివృద్ధిలో ప్రభుత్వానికి ఎంఐఎం మద్దతు

- అసదుద్దీన్ ఒవైసీ

అభివృద్ధిలో ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని అసుదుద్దీన్ ఒవైసీ తెలిపారు. 'తెలంగాణ మరింతగా అభివృద్ధి చెందాలన్నదే మా ఉద్దేశం. దానికి అనుగుణంగా పనిచేసే వారికి పూర్తి సహకారం అందిస్తాం. రేవంత్‌రెడ్డి సీఎం కాగానే పాతనగరంలో పలు రోడ్ల విస్తరణ పనులకు నిధులు కావాలని కోరా. రూ.120 కోట్లు అడిగితే, రెండు రోజుల తర్వాత స్వయంగా ఆయనే ఫోన్ చేసి రూ.200 కోట్లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ హయాంలో మూసీ నదిని అభివృద్ధి చేయాలి. అది పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది' అని వెల్లడించారు.

రాజకీయం కోసం శివరాత్రి సెలవుకు ఎసరు!

- పండుగ పూట విధుల్లో పంచాయతీ, రెవెన్యూ ఉద్యోగులు
- హైదరాబాద్ జిల్లా ఉద్యోగులంతా పండుగకు దూరం
- రాష్ట్ర ప్రభుత్వంపై సోషల్ మీడియాలో విమర్శలు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతో పలు విభాగాల ప్రభుత్వ ఉద్యోగులను శివరాత్రికి దూరం చేసిందనే విమర్శలొస్తున్నాయి. శుక్రవారం శివరాత్రి సందర్భంగా సెలవు అయినా.. పంచాయతీరాజ్, రెవెన్యూ ఉద్యోగులు విధుల్లోనే ఉన్నారు. హైదరాబాద్ జిల్లా ఉద్యోగులకు ముఖ్యమంత్రి కార్యక్రమాల నేపథ్యంలో శివరాత్రి, రెండో శనివారం, ఆదివారం సెలవులు రద్దు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మిషన్ భగీరథ స్పెషల్‌డ్రైవ్ పేరుతో పంచాయతీరాజ్ సిబ్బంది ఈ నెల 7, 8, 9 తేదీల్లో అందుబాటులో ఉండాలని గతంలోనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. రెవెన్యూ శాఖలో ధరణి దరఖాస్తుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఉద్యోగులను అనధికారికంగానే ఆఫీస్‌కు రప్పించారని ఆరోపిస్తున్నారు. హైదరాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి శంకుస్థాపనల నేపథ్యంలో కలెక్టరేట్ ఉద్యోగులు, జిల్లా అధికారులు, సూపరింటెండెంట్లు, రెవెన్యూ ఉద్యోగులకు 8,9,10 తేదీల్లో సెలవులు రద్దు చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సోమవారం తర్వాత ఏ క్షణమైనా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నందున ఆలోగానే వీలైనన్ని పనులకు శంకుస్థాపన చేసి, ఎన్నికల్లో ప్రచారం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నదనే ఆరోపణలొస్తున్నాయి. దీంతో రాజకీయ కారణాలతో ఉద్యోగులను శివరాత్రి పండుగకు దూరం చేస్తున్నారని వీహెచ్‌పీ విమర్శించింది. సోషల్‌మీడియాలో నెటిజన్లు సైతం రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. రాజకీయ కారణాలతో ఉద్యోగులను పండుగకు దూరం చేస్తారా? అని మండిపడుతున్నారు.

బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా సైదులు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల సొసైటీ కార్యదర్శిగా ఐఎఫ్‌ఎస్ అధికారి బీ సైదులును నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు విధుల్లో ఉన్న మల్లయ్య భట్టును బదిలీ చేసింది.

శివుడికి వెండి కిరీటం బహూకరించిన ముస్లిం భక్తుడు


మహాశివరాత్రి సందర్భంగా ఓ ముస్లిం భక్తుడు మతసామరస్యాన్ని చాటాడు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ఎండీ మౌలానా పట్టణంలోని శ్రీ భవానీ శంకర మహాదేవాలయానికి శుక్రవారం ఆలయ కమిటీ సమక్షంలో రూ. 20 వేల విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆలయ పూజారి విశ్వనాథశర్మ ప్రత్యేక పూజలు చేసి కిరీటాన్ని శివలింగానికి అలంకరించారు. మౌలానా కుటుంబానికి పరమశివుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. - హుజూరాబాద్ టౌన్

ఔషధాల ధరలు తగ్గించాలి

- టీఎంఎస్‌ఆర్‌యూ ప్రధాన కార్యదర్శి రాజ్‌భట్

విద్యానగర్, మార్చి 8: దేశ ప్రజల సంక్షేమం కోసం ఔషధాల ధరలు తగ్గించాలని, అన్ని మెడిసిన్లు, వైద్యపరికరాలపై జీరో శాతం జీఎస్టీ విధించాలని తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజుభట్ కోరారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిషేధించాలని, ప్రభుత్వరంగ ఫార్మా, వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలని కోరారు. ఫార్మారంగంలో అనైతిక కార్యక్రమాలను అరికట్టడానికి కోడ్‌ను అమలు చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. యూనియన్ 5వ మహాసభలు శని, ఆదివారాల్లో కరీంనగర్‌లోని పద్మశాలీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కదం తొక్కి హక్కులను కాపాడుకుందాం

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపు
- తెలంగాణభవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు సబిత, సునీత, కార్పొరేటర్లు కవిత, హేమ తదితరులు

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): కదం తొక్కి తెలంగాణ మహిళల హక్కులను కాపాడుకుందామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. మహిళల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాలను అనునిత్యం నిలుపుకుంటూ, ఆ స్ఫూర్తితో ముందుకు సాగుదామని అన్నారు. సమాజంలో ఎదుర్కొనే కష్టాలన్నింటిని ఛేదించడానికి, వారికి అండదండగా నిలిచేందుకు మహిళా దినోత్సవం స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణభవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత తెలంగాణతల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భగా కవిత మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ, సావిత్రిబాయిపూలే, రాణీరుద్రమదేవి వంటి వీరవనితలు చేసిన పోరాటాలు ఆడబిడ్డలకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మహిళా దినోత్సవం హక్కులను కాపాడుకునే దినోత్సవమని, సంబురంగా జరుపుకోవాలని, పోరాటస్ఫూర్తిని నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, సామ హేమ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలో నీట మునిగి ముగ్గురు మృతి

- నిజామాబాద్ జిల్లాలో ఘటన

ముప్కాల్/జక్రాన్‌పల్లి, మార్చి 8: ఎస్సారెస్పీ సందర్శనకు వెళ్లిన ముగ్గురు ప్రమాదవశాత్తు లక్ష్మీ కాలువలో నీట మునిగి మృతిచెందారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ముప్కాల్ పరిధిలోని లక్ష్మీ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద శుక్రవారం చోటుచేసుకున్నది. జక్రాన్‌పల్లి మండలం గన్యాతండాకు చెందిన సలావత్ వంశీ, అజ్మీర్ సందీప్, భూక్యా భాస్కర్, లోకేశ్ (17), సాయినాథ్ (16), మున్నా (17) స్నేహితులు. వీరు శుక్రవారం ఉదయం కారులో ఎస్సారెస్పీ సందర్శనకు వెళ్లారు. ప్రాజెక్టు లక్ష్మీ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద స్నానం చేసేందుకు కాలువలోకి దిగారు. ఇందులో ముగ్గురు బయటికి రాగా.. మిగతా ముగ్గురు లోకేశ్, సాయినాథ్, మున్నా గల్లంతయ్యారు. పోలీసులు.. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం ఈ ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి.